క్లుప్తంగా

హెచ్‌ఎం లాజరుబాబుకు ఉత్తమ పురస్కారం



పొన్నూరు: పట్టణంలోని నేతాజీ నగర్ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కాకుమాను లాజర్ బాబుకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం గుంటూరు రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగిన జిల్లా ఉత్తమ అవార్డు ప్రదానోత్సవం సభలో ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఈవో సీవీ రేణుక నుంచి లాజరుబాబు అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం లాజరుబాబుకు ఉపాధ్యాయులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. గత 10వ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించడం, తన విద్యార్థి రాష్ట్ర గవర్నర్‌చే అవార్డు పొందడం, స్కూల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు, పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడం, ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేపట్టడంతో అవార్డు దక్కిందని అవార్డు గ్రహీత కాకుమాను లాజరుబాబు అన్నారు.

దుప్పట్లు పంపిణీ



పెదకాకాని: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండలరావు ఆధ్వర్యంలో యానాది కాలనీలో శుక్రవారం దుప్పట్లు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కొండలరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పిల్లల్ని బడికి పంపించాలని, విద్య ద్వారానే జీవితాల్లో వెలుగులు చేకూరతాయన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ రామచంద్రన్ ఆర్థిక సహకారంతో నంబూరు గ్రామంలోని యానాది కాలనీలో పిల్లలకు అల్పాహారం, పెద్దలు దుప్పట్లు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఈమని ప్రతాపరెడ్డి, తులాబంధుల తాతయ్య, వల్లభాపురపు రాజ్ కుమార్, పాస్టర్ అబ్రహం, నాగేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలానే ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా స్కోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాపట్ల అగ్రికల్చర్ కాలేజీ ప్రొఫెసర్ శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో పెదకాకానిలోని గొండ్ల కాలనీలో విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

పార్కులలో పరిశుభ్రత పాటించాలి

కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు



పొన్నూరు: పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కులలో నిరంతరం పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు అన్నారు. శుక్రవారం నిడుబ్రోలులోని మున్సిపల్ పార్కు, పాతపొన్నూరులోని అంబేడ్కర్ పార్కులను ఆయన సందర్శించి శానిటేషన్, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు విద్యుత్ ఏఈగా సాంబశివరావు



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలం విద్యుత్ శాఖ ఏఈగా ధర్మవరపు సాంబశివరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న గౌతమ్‌ను భట్టిప్రోలు మండలానికి బదిలీ చేయగా, ఆయన స్థానంలో గుంటూరు డీ–7 సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సాంబశివరావును ప్రత్తిపాడుకు బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన స్థానిక సబ్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. లైన్‌మెన్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు, సబ్ స్టేషన్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

చలో విశాఖను జయప్రదం చేయాలి

యర్రబాలెం(మంగళగిరి): డిసెంబర్ 31వ తేదీ నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖలో జరుగనున్న సీఐటీయూ అఖిల భారత 18వ మహా సభలను విజయవంతం చేయాలని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి పిలుపునిచ్చారు. నగర పరిధిలోని యర్రబాలెంలో శుక్రవారం యర్రబాలెం, నవులూరు, బేతపూడి, నిడమర్రు మున్సిపల్ కార్మికుల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. జనవరి 4వ తేదీన జరిగే కార్మికుల మహా ప్రదర్శన ర్యాలీలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యూనియన్ నాయకులు టి.బాబు, ఓ.రామారావు, టి.ఆదిలక్ష్మి, శివనాగేంద్రమ్మ, కనకమ్మ, రజని, కె.కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు



పెదకాకాని శివాలయంలో పూజలందుకుంటున్న గణనాథుడు



శివాలయం నుంచి నిమజ్జనానికి బయలు దేరిన విఘ్నేశ్వరుడు

పెదకాకాని: వినాయక చవితి పురస్కరించుకుని పందిళ్లు, ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన గణనాథులకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భాగంగా పెదకాకాని శివాలయంలో ఏర్పాటు చేసిన మహా గణపతికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంపై మహాగణపతిని ఉంచి మేళతాళాల నడుమ అత్యంత వైభవంగా పెదకాకాని పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించినారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థాన ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ కొబ్బరికాయ కొట్టి గ్రామోత్సవం ప్రారంభించారు. గ్రామోత్సవం అనంతరం మహాగణపతి నిమజ్జన కార్యక్రమం శాస్త్రోక్తంగా పూర్తి చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ లీలాకుమార్ తెలిపారు. ముందుగా సహస్ర మోదక లక్ష్మీగణపతి హోమం ఆలయ స్థానాచార్యులు పాత్తూరి సాంబశివరావు పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, పెదకాకాని గ్రామ ప్రజలు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలి



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ

పెదకాకాని: ప్రజల తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తున్న చెరువు కట్టలకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని సుందరయ్య కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో గత నెల కురిసిన భారీ వర్షాలకు మంచి నీటి చెరువు, మురుగు నీటి చెరువుకు మధ్యలో గల కట్ట తెగినందున మంచినీటి చెరువులో మురుగునీరు చేరి నీరు కలుషితం అయిందన్నారు. దీంతో ఆ నీరు తాగే వీలు లేకుండా పోయిందని చెరువులో ఉన్న మురుగునీటిని తొలగించి చెరువును ఎండబెట్టి తరువాత మరలా నింపాలని శివాజీ డిమాండ్ చేశారు. గతంలో చెరువు కట్ట పనులు నాసిరకంగా జరిగినందు వలన వర్షానికి కట్ట తెగిపోయిందని, రెండు నెలలుగా గ్రామంలో మంచినీరు సరిగా రావడం లేదన్నారు. మురుగునీరు వస్తున్నందున గ్రామ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. గత ఏడాది కూడా చెరువు కట్టకు గండి పడిందని, దీనిక శాశ్వత పరిష్కార పనులు చేపట్టాలన్నారు. నీరు కలుషితం అయినా పంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా చెరువులో ఉన్న మురుగునీరు బయటకి పంపించి మంచినీటితో నింపి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శి బి.బాబురావు, ఉల్లంగుల శివయ్య, కె.సత్యనారాయణ, ఎస్ నీలాంబరం, బి.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి



పెదకాకాని గ్రంథాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి



సిబార్ దంత వైద్య కళాశాలలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీన్ డాక్టర్ కృష్ణప్రసాద్ తదితరులు



నంబూరు పేస్ ఎన్ఆర్ ఒలంపియాడ్‌లో గురుపూజోత్సవంలో చిన్నారులు

పెదకాకాని: ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొల్లిపర ఆనందరావు అన్నారు. పెదకాకాని గ్రంథాలయంలో శుక్రవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతి వేడుకలు శుక్రవారం జరిగాయి. గ్రంథాలయాధికారి నంద్యాల నాగిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొల్లిపర ఆనందరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఒక తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు అన్నారు. ఆయన దేశానికి రెండవ రాష్ట్రపతిగా ఉత్తమ సేవలు అందించారన్నారు. రెండు పర్యాయాలు ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా దేశం క్లిష్టకాలంలో ప్రధానులకు మార్గనిర్దేశం చేశారని విద్యార్థులకు వివరించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు కొల్లిపర ఆనందరావును సత్కరించారు. విద్యార్థులకు శతక పద్యాలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగంగుంట రవిబాబు, లింగంగుంట కిషోర్, సంకూరి సంగీతరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిబార్ దంత వైద్య కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం

పెదకాకాని: సిబార్ దంత వైద్య కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిపారు. మండలంలోని తక్కెళ్ళపాడు సిబార్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ గురువు ఈఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారెడ్డి గురువు డాక్టర్ రంగనాథన్ కన్నన్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా ఈఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు విద్య పట్ల, చేసే పని పట్ల అంకితభావం, నిబద్ధత, సమయపాలన కలిగి ఉండాలని, అప్పుడే ఉన్నత స్థానాలు చేరుకుంటారన్నారు. విద్యార్థులు అకుంఠిత దీక్షతో గురువులు చెప్పిన విధానాలను పాటించినట్లయితే కచ్చితంగా విజయాలు కలుగుతాయన్నారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ముఖ్యఅతిథులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపక డైరెక్టర్ ఎల్ సుబ్బారావు, డైరెక్టర్ టి.కృష్ణమోహన్, వైస్ డీన్ డాక్టర్ మన్నే ప్రకాష్, డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ డాక్టర్ పి.రేవతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. టీచర్స్ డే సందర్భంగా సిబార్ దంత వైద్య కళాశాల యాజమాన్యం కళాశాలలో విశిష్ట సేవలు అందించిన, దేశంలోని స్పెషాలిటీ అసోసియేషన్స్‌లోని పాలక మండలిలో విశిష్ట స్థానం పొందిన అధ్యాపకులను ప్రశంసా పత్రాలతో సన్మానించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ప్రత్తిపాడు: గురువు స్థానం ఎంతో గౌరవప్రదమైనదని మిట్టపల్లి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపికృష్ణ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం మిట్టపల్లి కళాశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొప్ప తత్వవేత్త, విద్యావేత్త సర్వేపల్లి అని కొనియాడారు.

● ప్రత్తిపాడులోని ఎస్ఆర్ఎస్ రెయిన్‌బోలో ప్రిన్సిపాల్ చిన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దిన వేడుకలు జరిపారు. విద్యార్థులు గురువుల పాదాలకు నమస్కరించి ఆశీస్సులు అందుకున్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

● శ్రీసరస్వతి రామా కోచింగ్ సెంటరులో నిర్వాహకులు పోపూరి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు శ్రీనివాసుల శేషభట్టరాచార్యులు, శ్రీనివాసుల సత్యమూర్తిల నివాసాలకు విద్యార్థులు వెళ్లి గురువుల పాదాలపై పూలు చల్లుతూ స్వాగతించారు. అనంతరం దుశ్శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

పెదకాకానిలో...

పెదకాకాని: సమాజంలో గురువుల పాత్ర ఎంతో పవిత్రమైనది పేస్ ఎన్ఆర్ ఒలంపియాడ్ చైర్మన్ పడమటి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గ్రామాల్లో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా జరుపుకున్నారు. పెదకాకాని కాళీగార్డెన్స్, గీతాంజలి విద్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పేస్ ఎన్ఆర్ ఒలంపియాడ్ చైర్మన్ పడమటి నాగేశ్వరరావు మాట్లాడుతూ అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించేవాడు గురువు అని, గురువును పూజించడం మన సంప్రదాయం అన్నారు. ఉపాధ్యాయ వత్తి అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాదు దైవత్వానికి సంబంధించిందనదన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు.

ఎన్జీరంగా వర్సిటీలో ఉపాధ్యాయ దినోత్సవం



ఎన్జీరంగా వర్సిటీలో...

గుంటూరు రూరల్: నగర శివారు లాంఫాంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు అధ్యక్షతన గురుపూజోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ క్రమశిక్షణ, ఉత్తమ విలువలు కలిగిన ఉపాధ్యాయుడని కొనియాడారు. ప్రతి మనిషి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత అంతటి ప్రాముఖ్యత కలిగిన గురువును గుర్తు చేసుకోవడం, వారి పట్ల గౌరవాన్ని తెలియజేయడమే నన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ డీన్ పీజీ స్టడీస్ డాక్టర్ ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

గుంటూరు రూరల్: మండలంలోని అడవి తక్కెళ్ళపాడు పుచ్చలపల్లి సుందరయ్యనగర్‌లోని ఎంవీఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ స్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్.తాండవకృష్ణ డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ గురువు అనే వారు విద్యతోపాటు విచక్షణా శక్తిని కూడా విద్యార్థులకు నేర్పించాలని, ఆ విచక్షణ పిల్లలను మంచి బాట వైపు నడిపిస్తుందన్నారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. రిటైర్డ్ ప్రొఫెసర్ శంకర్ పిచ్చయ్య అన్ని తరగతులలోని ఉత్తమ విద్యార్థులకు పారితోషకం ప్రకటించారు. కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రిన్సిపల్ కె.డి.ఎం.దివ్య, ఎల్ఎస్ భారవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెయింట్‌ఆన్స్‌లో గురుపూజోత్సవం

నగర శివారులోని గోరంట్ల గ్రామం సెయింట్‌ఆన్స్ మహిళా కళాశాలలో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ డాక్టర్ టి.సంధ్య డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాధాకృష్ణన్ రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్ షారోన్‌రోజ్ తదితరులు పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీలో ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న చలపతి ఫార్మసీ కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నగర శివారులోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ మహనీయ తాత్వికుడు, ప్రగాఢ విద్యావేత్త, దేశ రెండవ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవటం సంతోషకరమన్నారు. బోధనా వృత్తిలో అత్యుత్తమ సేవలను అందించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎస్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ డాక్టర్ మద్దినేని సుధాకర్‌కి, మొహాలీ నైపర్ విశ్రాంత డైరెక్టర్ ప్రొఫెసర్ కె.రఘురాంకి, తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆర్ నాగరాజుకి చలపతి ఫార్మసీ కళాశాల విశిష్ట ఉపాధ్యాయ అవార్డులను బహూకరించిందన్నారు. డాక్టర్ మద్దినేని సుధాకర్ మాట్లాడుతూ ఫార్మసీలో ఉపాధ్యాయుల పాత్ర అపారమైనదని చెప్పారు. ఫార్మసీ అంటే కేవలం ఔషధ తయారీ కాదని, ప్రాణ రక్షణకు సంబంధించిన శాస్త్రమని అన్నారు. ప్రొఫెసర్ కె.రఘురాం మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో జ్ఞానం నిరంతరం విస్తరిస్తూనే ఉందని, నూతన ఔషధాలు, నూతన టెక్నాలజీలు, పరిశోధనల ద్వారా ఎన్నో మార్పులు వస్తున్నాయన్నారు. ప్రొఫెసర్ ఆర్ నాగరాజు మాట్లాడుతూ ఫార్మసిస్ట్‌లు ఒక ఔషధాన్ని తయారు చేయగలరని, కానీ దానికి విలువను ఇచ్చేది మీ జ్ఞానం, నైతికత, మానవతా విలువలు, వీటన్నింటిని మీలో నాటేది ఉపాధ్యాయులేనని తెలిపారు. చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతి రోజు పంచే జ్ఞానం, విద్యార్థుల ద్వారా సమాజానికి ఔషధ రూపంలో తిరిగి చేరుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వై సుజిత్‌కుమార్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్ఎస్ రెయిన్‌బో పాఠశాలలో గురువు పాదాలకు నమస్కరిస్తున్న విద్యార్థిని



ప్రత్తిపాడులో గురువు పాదాలపై పూలు చల్లుతూ ఆహ్వానిస్తున్న విద్యార్థులు



సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మిట్టపల్లి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపికృష్ణ, అధ్యాపకులు



గురుపూజోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

పొన్నూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం 4 గంటలకు పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతులకు అండగా నిలిచే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9వ తేదీన రెవెన్యూ డివిజన్‌లో తలపెట్టిన ఆర్డీవోలకు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమం నిర్వహణపై సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పాల్గొంటారని, ఈ సమావేశంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలని కోరారు.

పోలీసుల అదుపులో గంజాయి ముఠా

పెదకాకాని: గంజాయి ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన శుక్రవారం పెదకాకానిలో చోటు చేసుకుంది. పెదకాకాని జాన్‌హస్పరస్ కాలనీలోని ఓ ఇంటిలో గంజాయి చిన్న చిన్న ప్యాకెట్లు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేసి ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితుల్లో నలుగురు మైనర్లు ఉండటం విశేషం. నిందితులు విశాఖపట్నం ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చినట్లు సమాచారం. నిందితులు పెదకాకాని జ్యోతినగర్, అంబేడ్కర్‌నగర్, జాన్‌హస్పరస్ కాలనీ, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన వారుగా గుర్తించారు. సాలపోగు చిన్ని, వేగి సూరిబాబుతో పాటు మరో నలుగురు మైనర్లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టి.పి.నారాయణస్వామి తెలిపారు.

తురకపాలెంను సందర్శించిన సీపీఐ బృందం



తురకపాలెంలో పర్యటించిన సీపీఐ సభ్యులు

గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామంలో జరుగుతున్న అంతుచిక్కని మరణాలు ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో, సీపీఐ బృందం శుక్రవారం గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకుంది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు చెబుతున్నట్లుగా కలుషిత నీరు ఈ మరణాలకు కారణమై ఉండవచ్చన్నారు. రాష్ట్ర హెల్త్ మినిస్టర్ ఇప్పటికే పరిశీలించినప్పటికీ స్పష్టమైన కారణాలు బయటకు రాలేదని పది రోజులుగా వైద్య శాఖ తిరుగుతున్నా ఇప్పటికీ వ్యాధికి కారణాలు తెలియక పోవటం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఈ సమస్యను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని, అనుమానాస్పద రోగులకు ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు ప్రభుత్వమే కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతం నుంచి జిల్లాలో వాటర్ ప్లాంట్లకు నీరు సరఫరా చేస్తూ, స్థానిక ప్రజలు కలుషిత నీటితో మరణించడం విడ్డూరంగా ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల సత్యనారాయణ, నగర సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బండారపు యశ్వంత్ శౌరి, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు ధూపాటి వెంకటరత్నం, విరిగినేని వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్నా, పి.వి.జగన్నాథం, ఏఐఎస్ఎఫ్ నాయకులు అమరనాథ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ



అందుకున్న సైకిళ్లతో విద్యార్థినులు

తాడేపల్లి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు ఉండవల్లి దేవుని మాన్యం వద్ద ఉన్న సీవీఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం ఉచితంగా సైకిళ్లను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డిస్ట్రిక్ట్ గవర్నర్ (3150) డాక్టర్ ఎస్.వి. రామ్‌ప్రసాద్ హాజరై మాట్లాడారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో 130 మంది బాలబాలికలకు సైకిళ్లను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఈదర పూర్ణచంద్రరావు, బీజీఆర్ మైనింగ్ లిమిటెడ్ డైరెక్టర్ విసిరెడ్డి బాలకోటిరెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ అధ్యక్షులు పంగలూరి కల్యాణ్, సెక్రటరీ లక్ష్మి, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చక్రవర్తి రెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు ప్రగడ రాజశేఖర్, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు శెట్టి రామకృష్ణ, కార్యదర్శి జెట్టి శ్రావణి, కోశాధికారి కావూరి వెంకట నగేష్, ప్రాజెక్ట్ చైర్మన్ ముస్నంగి వివేకానందరెడ్డి, పాస్ట్ ప్రెసిడెంట్ రావూరి రమేష్ బాబు, సుకుమార్ రెడ్డి, గోపు నాగ రాజేష్, కాట్రగడ్డ శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆలీనగర్‌ను దుగ్గిరాలలో విలీనం చేయాలి



దుగ్గిరాల: ఎన్నో ఏళ్లగా చిన్న పాటి సమస్యకు కూడా కొలకలూరు గ్రామం వెళ్లాల్సి వస్తోందని ఆలీనగర్ కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. శుక్రవారం దుగ్గిరాల మసీదు పక్కన గల ఆలీనగర్‌లో నివాసం ఉంటున్న ప్రజలు.. వారు ఎదుర్కొంటున్న గ్రామ విలీనంపై మాట్లాడారు. ప్రతి చిన్న పనికి కూడా 7 కిలో మీటర్ల దూరంలో ఉన్న కొలకలూరు గ్రామం వెళ్లడం ఇబ్బందిగా ఉందని వారు వాపోయారు. ఇప్పటికైనా ఆలీనగర్‌ను దుగ్గిరాలలో విలీనం చేసి ఇబ్బందులు తొలగించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎండీ సుభాని, ఎండీ హాజీక్, ఫఠాన్, జున్ను ఖాన్, ఎండీ ఉస్మాన్, క్రోసి, షేక్ భాషా తదితరులు పాల్గొన్నారు.